క్లుప్తంగా

బాల్ బ్యాడ్మింటన్‌లో బాలికలకు రజత పతకం



మైలవరం: విజయవాడ సిద్ధార్థ మహిళా కళాశాలలో గత రెండు రోజులుగా నిర్వహించిన అంతర్ కళాశాలల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ కళాశాల క్రీడాకారిణులు రజత పతకం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి బుధవారం తెలిపారు. తమ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న క్రీడాకారిణులు భువనేశ్వరి, సమీరా, సంధ్యారాణి, రమాకుమారి, సీత, హరిత, బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతున్న హారిక ప్రతిభ కనబర్చి బాల్ బ్యాట్మింటన్ పోటీల్లో రజత పతకం సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం



తిరువూరు: లయన్స్ క్లబ్ సభ్యులు సామాజిక సేవలో ముందుండాలని క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ లయన్ కంచర్ల ముత్యప్రసాద్ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండులో తిరువూరు లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ముందుకు వచ్చిన నాళ్లా సాయిప్రసాద్‌ను అభినందించారు. ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ ఆశాజ్యోతి, లయన్స్ క్లబ్ తిరువూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పీవీరావు, నాగుబండి శ్యాంసుందర్, సభ్యులు పాల్గొన్నారు.

చాట్రాయి: చాట్రాయి గ్రామ సచివాలయంలో బుధవారం చలివేంద్రం ప్రారంభించారు. ఆర్ఐ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు

హిందీ పరీక్షకు 59 మంది గైర్హాజరు



నూజివీడు: నియోజకవర్గంలోని 18 పరీక్షా కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన టెన్త్ హిందీ పరీక్షకు 59 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 3,437 మందికి గాను 3,378 మంది హాజరయ్యారు. నూజివీడు పట్టణంతో పాటు నూజివీడు మండలంలో కలిపి 10 పరీక్షా కేంద్రాల్లో 1,483 మందికి గాను 17 మంది గైర్హాజరుకాగా 1,466 మంది హాజరయ్యారు. ఆగిరిపల్లి మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో 567 మందికి గాను 9 మంది గైర్హాజరవ్వడంతో 558 మంది హాజరయ్యారు. చాట్రాయి మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో 439 మందికి గాను 4 మంది గైర్హాజరవ్వగా 435 మంది, ముసునూరు మండలంలోని 3 పరీక్షా కేంద్రాల్లో 593 మందికి 11 మంది గైర్హాజరవ్వగా 582 మంది పరీక్షలు రాశారు.

సారా నిర్మూలనపై గ్రామాల్లో ప్రచారం



ముసునూరు: పల్లెలను సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదామని నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ. మస్తానయ్య పిలుపునిచ్చారు. సారా నిర్మూలనపై ముసునూరు, గోపవరం, కాట్రేనిపాడు, వేల్పుచర్ల, చిల్లబోయినపల్లి గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ నూజివీడు సర్కిల్ టీమ్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన సారా నిషేధ కమిటీల ఎంపికలు నిర్వహించారు. చింతలవల్లి, చెక్కపల్లి, గుళ్లపూడి, వేల్పుచర్ల, చిల్లబోయినల్లి గ్రామాలకు చెందిన పాత నేరస్తులు పల్లెపాము పద్మకుమార్, తాళం రాజు, నారిపేళ్ల సత్యవతి, మరీదు నాగబాబు, వడిత్యా పెదలక్ష్మి, మరీదు రవిలను తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

అడ్మిషన్లు అనుమానమే!

- కేంద్రియ విద్యాలయం తాత్కాలిక భవనాన్ని సిద్ధం చేయడంలో జాప్యం
- మైనర్ మరమ్మతులు చేపట్టని అధికారులు
- ఏడెకరాల స్థలంలో పిచ్చి చెట్ల తొలగింపు పనులను చేపట్టడంలోనూ నిర్లక్ష్యం



నూజివీడులో కేంద్రియ విద్యాలయం కోసం సిద్ధం చేసిన తాత్కాలిక భవనం

నూజివీడు: నూజివీడుకు మంజూరైన కేంద్రియ విద్యాలయానికి సంబంధించి స్థానిక అధికారుల తీరుతో రానున్న విద్యా సంవత్సరంలో ఇక్కడ అడ్మిషన్లు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ప్రాంత విద్యార్థులు కేంద్రియ విద్యాలయంలో చదవాలంటే విజయవాడ, ఏలూరు, మచిలీపట్నం వెళ్లే పనిలేకుండా నూజివీడుకు మంజూరైంది. అయితే ఈ విద్యాలయం ఏర్పాటుకు సిద్ధం చేసిన తాత్కాలిక భవనంలోని మైనర్ రిపేర్లను త్వరితగతిన పూర్తిచేసి అప్పగించాలని కేంద్రియ విద్యాలయ సమితి అధికారులు నెల రోజుల కిందటే కోరినా ఇంతవరకు స్థానిక అధికారులు ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు.

భవనం అప్పగిస్తే ఏప్రిల్‌లోనే అడ్మిషన్లు

తమకు తొందరగా భవనాన్ని అప్పగిస్తే ఏప్రిల్ నుంచే అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభిస్తామని ఈ ఏడాది ఫిబ్రవరి ఆరో తేదీన నూజివీడు విచ్చేసిన సికింద్రాబాద్‌లోని కేంద్రియ విద్యాలయ సమితి డెప్యూటీ కమిషనర్ డి. మంజునాథ్ మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌లకు తెలిపారు. అలాగే ఈ ఏడాది జనవరి 18న మచిలీపట్నంలోని కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ ఆసీఫ్ హుస్సేన్, ఈనెల 14న ఏలూరు కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ బీఎస్ మీనా సందర్శించి తాత్కాలిక భవనంలోని మైనర్ మరమ్మతు పనులు, ఏడెకరాల స్థలంలోని పిచ్చి చెట్ల తొలగింపు పనులు పూర్తి చేసి సాధ్యమైనంత త్వరగా అప్పగించాలని సూచించారు. తాత్కాలిక భవనంలో ఊడిపోయిన వాటి స్థానంలో వాటర్ ట్యాప్‌లు, తలుపులకు గడులు బిగించడం, మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి అప్పగించాలని చెప్పి వెళ్లారు. అయినప్పటికీ మైనర్ రిపేర్ల పనులు గాని, ఏడెకరాల స్థలంలో పిచ్చి చెట్ల తొలగింపు పనులు గాని నేటి వరకు చేపట్టకపోవడం గమనార్హం.

కేంద్రియ విద్యాలయం కోసం ప్రతాప్ కృషి..

కేంద్రియ విద్యాలయం మంజూరు కోసం గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తీవ్రంగా కృషి చేశారు. దీని ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు తీసుకుని ఢిల్లీలోని కేంద్రియ విద్యాలయ సమితి ప్రధాన కార్యాలయానికి మూడుసార్లు వెళ్లి నూజివీడుకు కేంద్రియ విద్యాలయం మంజూరయ్యేలా చూశారు. విద్యాలయం శాశ్వత భవనాల నిర్మాణానికి అవసరమైన ఏడెకరాల స్థలాన్ని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం కేటాయించేలా కృషి చేశారు. విద్యాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు ఎంప్లాయీస్ కాలనీలోని మూసేసిన పాఠశాల భవనాన్ని మరింత అభివృద్ధి చేసి సిద్ధం చేశారు. ఇంత చేసి కేంద్రియ విద్యాలయాన్ని తీసుకువస్తే చివరిదశకు వచ్చేసరికి ప్రస్తుత అధికారులు చిన్నచిన్న పనులు చేయించేందుకు కూడా నెలల తరబడి జాప్యం చేస్తుండటంపై రాజకీయ వర్గాల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతోన్నాయి. అధికారుల అలసత్వం వల్ల వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల సైతం నిలిచిపోయే ప్రమాదం ఉంది. దీని వల్ల ఈ ప్రాంత పిల్లలు కేంద్రియ విద్యాలయాల్లో అడ్మిషన్ల కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. చిన్నచిన్న మరమ్మతు పనులు, పిచ్చిచెట్ల తొలగింపు పనులు శరవేగంగా చేపట్టి పూర్తిచేసి కేంద్రియ విద్యాలయంకు భవనాన్ని, ఏడెకరాల స్థలాన్ని అప్పగించాల్సిన ఆవశ్యకత నెలకొంది.

కలెక్టర్‌కు మేకా ప్రతాప్ లేఖ..

అధికారులు చేస్తున్న జాప్యం వల్ల కేంద్రియ విద్యాలయం అడ్మిషన్ల నోటిఫికేషన్ నిలిచిపోయే ప్రమాదం నెలకొందని, మీరైనా చొరవ తీసుకొని త్వరితగతిన మైనర్ రిపేర్లు, జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేసి వాటిని కేంద్రియ విద్యాలయం సమితికి అప్పగించాలని కోరుతూ నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వీకి లేఖ రాశారు. అడ్మిషన్ల నోటిఫికేషన్ వస్తే ఈ ప్రాంత పిల్లలకు ఎంతో మేలు జరుగుతుందని లేఖలో పేర్కొన్నారు.

జూన్ నుంచి తరగతులు నిర్వహించాలి



నూజివీడుకు మంజూరైన కేంద్రియ విద్యాలయానికి సంబంధించి తరగతులు జూన్ నుంచి నిర్వహించాలి. దీని వల్ల ఈ ప్రాంతంలోని విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది.

– తుమ్మూరు రాజేష్, నూజివీడు

వైఎస్ జగన్‌ను కలిసిన తిరువూరు నాయకులు





వైఎస్ జగన్‌తో స్వామిదాసు, సుధారాణి, నాయకులు రామచంద్రారెడ్డి, నవీన్, రవికుమార్ తదితరులు

తిరువూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి తదితరులు బుధవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ మార్పు విషయమై కౌన్సిలర్లతో కలిసి వైఎస్ జగన్‌తో స్వామిదాసు చర్చించారు. తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, పార్టీ తిరువూరు మండల అధ్యక్షుడు తాళ్లూరి నవీన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కలకొండ రవి కుమార్, తిరువూరు నగర పంచాయతీ చైర్ పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్మన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, మూడు దుర్గారావు తదితరులు వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

పరీక్ష కేంద్రంలో ఆర్డీఓ తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధురి

తిరువూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న తిరువూరులోని నారాయణ స్కూల్లో రెవెన్యూ డివిజినల్ అధికారి కె. మాధురి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తాగునీరు ఏర్పాటు చేయాలని, నిబంధనల మేరకు ఇన్విజిలేటర్లు వ్యవహరించాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు పరిశీలించారు.

కొలతల్లో తేడాలు కనిపిస్తే చర్యలు

జీకొత్తూరు(తిరువూరురూరల్): మండలంలోని జీకొత్తూరు పెట్రోలు బంకును తిరువూరు ఆర్డీఓ మాధురి బుధవారం తనిఖీ చేశారు. వినియోగదారులకు ఖచ్చితమైన కొలతలతో పెట్రోలు, డీజిల్ అందించాలని, కొలతల్లో తేడా కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలని రైల్వే కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న ఎంప్లాయీస్ సంఘ్ ఉద్యోగులు, కార్మికులు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): అపరిష్కృతంగా ఉన్న రైల్వే ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్ షాపు గేటు ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఎంప్లాయీస్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య పిలుపు మేరకు జరిగిన ధర్నాలో వర్క్‌షాపు బ్రాంచి కార్యదర్శి, డెప్యూటీ డివిజినల్ సెక్రటరీ గద్దా సురేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. పెన్షన్ విధానంలోని లోపాలు సరిచేసి అందరికీ ఓపీఎస్ పెన్షన్ అమలు చేయాలని, రైల్వే ప్రైవేటీకరణ ఆపాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, రైల్వేలో ప్రస్తుతం ఉన్న పోస్టుల సరెండర్ ప్రక్రియను పూర్తిగా నిలిపి వేయాలని కార్మికులపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. బ్రాంచి అధ్యక్షుడు పామర్తి శివనాగేశ్వరరావు, వర్కింగ్ చైర్మన్ దాసరి డేవిడ్ రాజు, కోశాధికారి పి.విమల్ సాయి, గూడవల్లి సుధాకర్, ఎస్.బోయాజ్, ఎండీ రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యా యత్నం

మైలవరం: బంధువుల వేధింపులతో మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన పోరాట నగర్‌లో బుధవారం జరిగింది. మైలవరం మండలం పోరాట నగర్‌కు చెందిన ఆంగోతు ఆనందరావు భార్య ఆంగోతు జయ (45) చేయని అప్పులను చెల్లించాలంటూ తన మరిది, మరి కొంతమందితో కలిసి తమను వేధిస్తున్నాడంటూ ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా కుమార్తెలు అడ్డుకుని బాధితురాలిని మైలవరం ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బాధితురాలు జయ మాట్లాడుతూ పోరాట నగర్‌లో తాము చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నామని, తమకు గ్రామంలో వ్యవసాయ భూమి కూడా ఉందని తెలిపింది. కోళ్ల రవాణాకు లారీని వాయిదాల పద్ధతిలో తీసుకున్నామని తెలిపింది.తన భర్తను తాగుడుకు బానిసను చేసి తన మరిది చేయని అప్పులను కూడా తమపై రుద్దుతూ మరి కొంతమందితో కలిసి ఇంటికి వచ్చి దుర్భాషలాడుతూ తమను మానసిక వేదనకు గురి చేశాడని ఆరోపించింది. లారీని స్వాధీనం చేసుకుని వాయిదాలు చెల్లించాలని, తమకు రూ.లక్షల్లో అప్పుపడ్డారంటూ వ్యవసాయ భూమిని అమ్మి తన అప్పు చెల్లించాలని వేధించారని తెలిపింది. తనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, వారి చదువుకు, పెళ్లిళ్లకు వ్యవసాయ భూమి ఉపయోగపడుతుందని ఆశిస్తే ఆది స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, గత్యంతర లేక తాను ఆత్మహత్యకు యత్నించానని బాధితురాలు తెలిపింది.

అభివృద్ధికి అడ్డుపడుతూ వేధింపులు

సర్పంచ్ మంజుభార్గవి ఆవేదన



మైలవరం: మైలవరం పంచాయతీ వార్డు సభ్యులు ఇద్దరు పంచాయతీలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులకు అడ్డు తగులుతూ వేధిస్తున్నారని సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి ఆవేదన వ్యక్తం చేశారు. తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. వార్డు సభ్యులు చిట్టిబాబు, రమేష్ పంచాయతీలో కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించకుండా అడ్డు తగులుతూ మానసికంగా వేధిస్తున్నారని చెప్పారు. పంచాయతీ కాంట్రాక్టు పనులు ఇష్టం వచ్చిన వారికి ఇస్తున్నానంటూ, ఇష్టారాజ్యంగా పంచాయతీ నిధులు దుర్వినియోగం చేస్తున్నానంటూ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. తనపై చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని, నిరూపించాలని కోరారు. తాను ఎస్సీ మహిళనన్న చిన్న చూపుతో చూస్తున్నారని తెలిపారు. తమకు సంబంధించిన వారికి కాంట్రాక్టు పనులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, అయితే తాను పంచాయతీ ఆమోదంతోనే కాంట్రాక్టు పనులు కేటాయిస్తున్నట్లు సర్పంచ్ వివరించారు.

వార్డు సభ్యులపై అట్రాసిటీ కేసు నమోదు

మైలవరం: ఎస్సీ మహిళా సర్పంచ్‌పై అగ్రవర్ణాల వార్డు సభ్యులు అసభ్య పదజాలంతో దూషించిన ఘటనపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. మైలవరం గ్రామ పంచాయతీలో ఈ నెల 17న జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో మహిళా సర్పంచ్ జి. మంజుభార్గవిని 12వ వార్డు సభ్యుడు చిట్టిబాబు, 18వ వార్డు సభ్యుడు రమేష్ కులం పేరుతో దూషిస్తూ అవమానించారు. బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు

డీపీఓ లావణ్యకుమారి

చిలుకూరు(ఇబ్రహీంపట్నం): గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుతో పాటు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి లావణ్య కుమారి పేర్కొన్నారు. చిలుకూరు గ్రామ పంచాయతీలో బుధవారం ఆమె ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలో చేపడుతున్న ఇంటింటి చెత్త సేకరణ పనులను పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణలో అవలంబించాల్సిన విధివిధానాలను పారిశుద్ధ్య కార్మికులకు వివరించారు. ప్రజలకు కూడా తడి,పొడి చెత్తను విడివిడిగా పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. చెత్త సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. వానపాములతో వర్మికంపోస్ట్ తయారీని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులు పంట పొలాలకు వర్మి కంపోస్ట్ వినియోగించేలా ప్రోత్సహించాలన్నారు. ఈఓపీఆర్డీ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు అదనపు నిధులు

చాట్రాయి: మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన గృహ నిర్మాణాలకు ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేస్తోందని హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019–24 వరకు ఎస్సీలు 609, ఎస్టీలు 36, బీసీలు 133 గృహ నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచి పోయాయని చెప్పారు. వీరికి అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు నిధులు మంజూరు చేయనున్నామని చెప్పారు.

మల్లేలలో 'పొలం పిలుస్తోంది'

మల్లేల(తిరువూరురూరల్): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని మల్లేలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మల్లేల జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు పంటల సాగు, వరిని ఆశించే తెగుళ్లు, శత్రు, మిత్ర పురుగుల గురించి వ్యవసాయాధికారి పద్మ వివరించారు. రైతులకు సస్యరక్షణ చర్యలు, అధిక దిగుబడి సాధించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు.

22న మండల పరిషత్ సమావేశం

మైలవరం: మైలవరం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22న మధ్యాహ్నం రెండు గంటలకు మండలం పరిషత్ సమావేశ హాలులో జరుగుతుందని ఎంపీడీఓ అనూరాధ తెలిపారు. ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి అధ్యక్షతన జరుగనున్న సమావేశానికి ఎంపీటీసీలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

సారా విక్రయదారుల బైండోవర్

చాట్రాయి: సారా విక్రయదారులను బైండోవర్ చేశామని నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు తెలిపారు. గతంలో సారా అమ్మిన 11 మందిని బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ గీత ఎదుట బైండోవర్ చేశామని చెప్పారు.

వసతి గృహం నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు

మైలవరం: మైలవరంలో ఎస్సీ బాలికల వసతిగృహం నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం పట్టణంలో ఎస్సీ బాలికల హాస్టల్ భవనాన్ని నిర్మించేందుకు రూ.3 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ప్రకటించారని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ మేరకు తనకు ప్రత్యేక లేఖ ద్వారా మంత్రి శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారన్నారు. హాస్టల్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు, మంత్రి శ్రీబాల వీరాంజనేయస్వామికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన సీఎం చంద్రబాబు

నూజివీడు: రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాటలు నమ్మి కూటమికి ఓట్లు వేసి అత్యధిక సీట్లతో గెలిపించిన ప్రజల నమ్మకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు వమ్ము చేశారని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి హరినాథ్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రాన్ని ప్రశ్నించడం లేదని ఎన్నికల ముందు రంకెలు వేసిన చంద్రబాబు నేడు మోడీ ముందు మోకరిల్లుతున్నారని ఎద్దేవా చేశారు. అమరావతి అభివృద్ధికి బడ్జెట్లో నిధులు కేటాయించని మోదీని అమరావతికి ఆహ్వానించటం సిగ్గుచేటన్నారు. మోదీని ప్రసన్నం చేసుకోవడంలో భాగంగా హిందీని బలవంతంగా రుద్దుతున్నా కేంద్రాన్ని చంద్రబాబు ప్రశ్నించకపోవడం బాధాకరమన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గుళ్ళు, గోపురాలు చుట్టూ తిరుగుతూ పాలన గాలికి వదిలేశారన్నారు.

మద్యం మత్తులో దాడులు.. ఇద్దరికి గాయాలు

జి.కొండూరు: పాత కక్షల నేపథ్యంలో మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన జి.కొండూరు మెరక మీద వైన్‌షాపు సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. వివరాలలోకి వెళ్తే.. జి.కొండూరు మండల పరిధి చెర్వుమాధవరం గ్రామానికి చెందిన బాణావతు కోట్యానాయక్, వినపాక శివారు విద్యానగరానికి చెందిన ప్రసాద్‌తో పాటు మరి కొంతమంది కలిసి బుధవారం సాయంత్రం మూడు గంటల సమయం నుంచి జి.కొండూరు మెరకమీద ఉన్న ఓ వైన్ సమీపంలో మద్యం సేవించారు. కాగా ప్రేమ వివాహ విషయమై కోట్యానాయక్, ప్రసాద్ మధ్య తలెత్తిన వివాదం ముదిరి ఒకరిపై ఒకరు దాడి చేసుకునే స్థాయికి వెళ్లింది. ఈ క్రమంలో అప్పటివరకు తాగిన మద్యం సీసాలను పగలగొట్టి ఒకరిని ఒకరు పొడుచుకున్నారు. ఈ ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలు కాగా ప్రసాద్ అక్కడి నుంచి పరారయ్యాడు. కోట్యానాయక్ మాత్రం గాయాలతో అక్కడే పడి ఉండడంతో స్థానికులు 108 వాహనంలో మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

ఇబ్రహీంపట్నం: తుమ్మలపాలెం గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరందరూ కిలేశపురం గ్రామానికి చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు. వారి నుంచి కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ఏ ప్రాంతం నుంచి, ఎన్ని కిలోలు తీసుకువచ్చారు, గంజాయి తరలింపు వెనక ఎవరెవరు ఉన్నారనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

రేషన్ షాపుల తనిఖీ

మైలవరం: రెడ్డిగూడెం మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను మండల తహసీల్దార్ జె. సుశీలాదేవి బుధవారం పరిశీలించారు. నాలుగు పరీక్ష కేంద్రాల్లో మంచినీరు, వైద్యం, అన్ని సదుపాయాలు కల్పించారని తహశీల్దార్ చెప్పారు. అన్నేరావుపేట, రంగాపురంలోని రెండు రేషన్ షాపులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, వీఆర్‌ఓలు రాజేష్, జానీసాహెబ్, లావణ్య పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

చాట్రాయి: మండల పరిషత్ సమావేశం ఈ నెల 21న నిర్వహిస్తామని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరు కావాలని కోరారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ఆంజనేయపురం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఆంజనేయపురం సర్పంచి మామిడి కుటుంబరావు అన్నారు. ఆంజనేయపురం సచివాలయంలో బుధవారం చైల్డ్ వెల్ఫేర్, ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఆడపిల్లలను ఉన్నత విద్యావంతులను చేయాలని తల్లిదండ్రులకు సూచించారు.